# కలవరం

"ఏం రామన్నా! ఎలక్షన్లు జోరుగుండాయా మీ వూళ్ళో!"

"ఆ ఏం ఎలక్షన్లులే రాజన్నా! ఎప్పుడూ వచ్చేవే కదా!"

"అట్టా అని యిడిసిపడుతుండామా ఏమి ప్రతి సబకూ ఎల్లివ స్తానే వుంటిమి కదా! ఇంతకీ మీ వూరిలో ఏ పార్టీ గెలుస్తుందం టావు?"

"ఏమో! ఎట్టా తెలుస్తాది? అన్ని సభ ల్లోనూ ఒకే మాదిరిగా జనం కలుస్తా ఉండిరి. రాజకీయాలు చూసి మన జనం కూడా నేర్చుకున్నారులే రాజన్నా!'

ఈ సంభాషణ విని చదువుతున్న పుస్త కంలో నుండి తలెత్తి చూశాడు సత్యం. ఎమ్.ఏ. పొలిటిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి పి.హెచ్.డి. చేస్తున్న విద్యార్థి సత్యం, అత నికి రాజకీయాలంటే మక్కువ. కాలేజీ రాజకీ యాల్లో చురుకుగా పాల్గొంటూ, విద్యార్థి నాయకుడుగా ఎన్నికయ్యాడు. చదువు కున్న వారిలో మాత్రమే రాజకీయ చైతన్యం ఉంటుందని విశ్వసించే అతనికి బస్‌లో తన వెనుకసీటులో కూర్చొని ఉన్న పల్లెటూరి రైతుల సంభాషణలు ఆశ్చర్యం కలిగించింది. అతనిలో ఎన్నో ఆలోచనలను రేకెత్తించింది.

స్వతంత్ర భారతావనిలో ఎన్నికలే మనల క్ష్యాలు, మన పురోగతికి చిహ్నాలు ఎన్నికల్లో ఎంతో సందడి, సరదాలతో గడచిపోయే క్షణాలు ఎంతో ఆర్భాటంగా ప్రతి ఇంటికి ముంగిటికీ వచ్చిపోతుంటాయి. నిరాశావా దుల్ని ఆశావాదులుగా మారుస్తాయి. అందుకే ఎన్నికలు అంటే ఎన్నికలలు! మన భవిష్యత్తు, మనదేశ భవిష్యత్తు, వీటిపై ఆధా రపడి ఉంటాయి. అని అందరి అభిప్రాయం. అందుకేనేమో ఎలెక్షన్లంటే ఓట్ల కలెక్షన్లని తెలిసి కూడా దేశమంతటా సందడి, గందర గోళం. పత్రికల్లో, దూరదర్శన్‌లో, ఆకాశవా ణిలో, పురవీధుల్లో, ఆఫీసుల్లో, ఇళ్లల్లో అక్కడ ఇక్కడ అనకుండా ప్రతిచోటా ప్రతి నోటా ఎలెక్షన్లను గూర్చి చర్చే సత్యం ఆలోచ నల్లో ఉండగానే అతడు దిగవలసిన ఊరు వచ్చేసింది.

మారుమూల గ్రామమైన ఆ ఊరి వీధుల్లో వివిధ పార్టీల పతాకాలు, బ్యానర్లు, గోడలపై పార్టీల గుర్తులతో బాటు పవిత్రమైన మీ ఓటును మా (మీ) పార్టీకే వేయండి, వేయిం చండి. వేసి గెలిపించండి లాంటి నినాదాలు అతనికి కనిపించాయి నడుస్తుంటే. "కనీసం ఎన్నికల సమరంలో అయినా ప్రజల విలువ, వారి ఓట్ల పవిత్రత గుర్తు వస్తున్నాయి' అని నవ్వొచ్చింది. అతనికి ఎన్నికల పుణ్యమా అని రోజుకు ఒక్కసారి ఒక్కబస్ మాత్రమే వచ్చి వెళ్లే ఆ ఊరికి పెళ్లి కళ వచ్చింది. పార్టీల కార్యకర్తల హడావుడి, రంగు రంగుల పార్టీ జండాల రెపరెపలతో వీధులకు వింత అందం వచ్చింది.

ఆలోచనలతో తలమునకలుగా ఉన్న సత్యం భుజంపై చెయ్యి పడటంతో ఉలిక్కి పడి చూశాడు.

వెంకన్న! వెంకన్న సత్యానికి చిన్ననాటి స్నేహితుడు ప్రైమరీ స్కూల్లో చదివే రోజుల్లో క్లాస్‌మేట్ కూడ! ఆ ఊరి బడిలో ఏడ వతరగతి వరకు చదివి, పై చదువుల కోసం బయటి ఊరికి వెళ్ళలేక చదువు ఆపేశారు. సత్యం పట్నం వెళ్ళి చదువుకున్నాడు. సెల వల్లో ఊరికి వచ్చినప్పుడు అతని కాలక్షేపం వెంకన్నతోనే! ఎక్కువ చదవకపోయినా తెలి వైనవాడు. చురుకైనవాడు కావటంతో ఊరి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ ఉంటాడు వెంకన్న.

"ఇప్పుడేనా బాబూ రావటం! బాగు న్నావా! ఏమిటీ ఆలోచిస్తూ నిలబడిపో యావు" అడిగాడు వెంకన్న సత్యం చేతి లోని బ్యాగ్ అందుకోబోలేడు!

వద్దులే వెంకన్నా! బరువు లేదులే!

సరేగానీ వెంకన్నా! ఊరిలో ఎన్నికల హడావుడి బాగా ఉన్నట్టుందే" అడిగాడు సత్యం.

"మామూలే కదా సత్యం బాబూ! ఎప్పుడూ ఉండేదే కదా! కాకపోతే ఈసారి మన శేషయ్యబాబు ఎలెక్షన్లలో నిలబడ్డాడు. అతని తరపున నేను కూడా ప్రచారం చేస్తుండా' చెప్పాడు వెంకన్న.

"ఎవరూ శేషయ్య!' ఆశ్చర్యంగా అడి గాడు సత్యం.

"ఆ! మన శేషయ్యబాబే! అదే! మన పెద్ద దొరగారి కొడుకు! మనతో బాటే సదూకోలా ఆ బాబే! ఈ సాయంకాలం బయిరంగసబ పెడుతుండారు. పార్టీ పెద్దలందరూ వస్తుం డారు, నీవింకా ఉంటావుగా! అని అడిగాడు వెంకన్న.

"ఇప్పుడేగా వస్తున్నాను ఇంకా వారం పదిరోజులుంటానూ ఏం ఎందుకని?" ప్రశ్నించాడు సత్యం.

"మరేం లేదులే! సాయంత్రం సబకు నీవు కూడ రారాదూ! మన నేస్తులందరూ వస్తుం డారు. నేనొచ్చి పిలుస్తా ఆరు గంటలకి తాయరుగా ఉండు" అని చెప్పి సత్యం ఇల్లు రావటంతో వెళ్లిపోయాడు.

ఇంట్లో అందరినీ పలకరించి భోజనం చేసి మధ్యాహ్నం కావటంతో పడుకున్నాడు సత్యం! అతని ఆలోచనల నిండా శేషయ్య!

బి. లక్ష్మీఫణీంద్ర



ఊరి బడిలో చదివేటప్పుడు అతని క్లాసు సేటె! క్లాసులో అందరికన్నా పెద్ద ప్రతి తరగతీ తప్పటమే! ఊరి కామందు కొడుకు కావటంతో ఎవరూ ఏమీ అనలేకపోయేవారు. తన కన్నా చిన్నా పెద్దా అందరినీ వెంటేసుకొని అల్లరిని చిల్లరిగా తిరిగే ఆనాటి శేషు, "ఓ" అంటే "న"రానివాడిగా ముద్రపడి ఏడవతరగతి అయినా గట్టెక్కలేకపోయిన శేషు ఈనాడు ఊరిని ఉద్ధరించే ప్రజా ప్రతినిధి కాబోతున్నాడా? వెళ్లి ప్రజలు మన ఊరి వాడన్న అభిమానంతో గెలిపించినా గెలిపిస్తారు. ఆ తరువాత భవిష్యత్తు? ఆలోచనల్లో నుండి అలాగే నిద్రలోకి జారుకున్నాడు సత్యం!

ఆ ఊరిలో బహిరంగసభలు ఏర్పాటు చేసే స్థలం ఊరిబడి మైదానం. సాయంత్రం చెప్పిన సమయానికి ముందే జనం గుంపులు గుంపులుగా ఆ ఆవరణలో చేరి నాయకుల రాకకై వేచి ఉన్నారు. ఊరి జనంలో దాదాపు డెబ్భైశాతం అక్కడ హాజరయ్యారు. ఎన్నికలంటే వాళ్లకున్న ఉత్సాహానికి అతనికి ఆశ్చర్యంతో బాటు సంతోషం కూడా కలిగింది.



పార్టీ బ్యానర్లు గాలికి రెపరెపలాడుతుంటే చదివి ఆశ్చర్యపోయాడు సత్యం అతని ఆశ్చర్యాన్ని గుర్తించినట్లుగా వెంకన్న, 'ఇది కొత్త పార్టీ అట బాబూ! పార్టీ అధ్యచ్చుడు పదవు రానోల్ల అభిమానం కూడా సంపాయించాలని ఏలి మద్రలు గుర్తుగా ఎన్నుకున్నాడట! మన దేశంలో నిరచ్చరాస్యులే ఎక్కువట కదా! ఈ గుర్తుకయితే ఓట్లు బాగా పడతాయని ఆరి నమ్మకం! అందుకే సంతకం చెయ్యటం రాని శేషయ్యబాబుని అభ్యర్థిగా ఎన్నుకున్నారట. అయినా నాకు తెలీకడుగుతా బాబూ! ఏలిముద్రలు మానండి సంతకాలు నేర్వండి అని సెప్పే పెబుత్వం ఈ గుర్తుకెట్టా ఒప్పుకుందో? "ఇంకా వెంకన్న మాటలు పూర్తికాకముందే కార్లు ఆగిన శబ్దం, సభావేదికపైకి ప్రముఖులు రానున్నారన్న వార్త వినిపించటంతో జనంలో సందడి, తొక్కిసలాట, కేరింతలు జయజయ నినాదాలు ఎక్కువయ్యాయి. సభా వేదిక నలంకరించిన ప్రముఖులు ఒక్కొక్కరే మైకు దగ్గరికి వచ్చి తమ పార్టీ ఆశయాలను వివరించి, అంతకు మించి పాలక ప్రభుత్వ దురాగతాలను, ఇతర పార్టీల స్వార్థపరతను దుయ్యబట్టి తమ పార్టీ అభ్యర్థినే గెలిపించమని అభ్యర్థించారు.

చివరగా పార్టీ టిక్కెట్‌పై నిలబడిన శేషయ్య మైకు దగ్గరికి వచ్చిందే ఆలస్యం జనంలో సందడి, కేరింతలు, జయజయ నినాదాలు ఎక్కువయ్యాయి. 'నా పియ పెజలారా! ఈ దినం మనమంతా ఇక్కడ ఉన్నామంటే దానికి కారణముంది. అదేమంటే నా సేవ అంటే పెజాసేవ సేయాలంటే మీ ఓటు ముద్ర నా ఏలు ముద్రగురుతుపై ఏసి గెలిపించండి. ఎప్పుడూ మీకు సేవసేయటం నా జీవిత ధ్యేయం. నాకు సదువురాదు కదాని అనుమానిత్తుండారేమో! సేవ సేసేందుకు సదువెందుకు? అసలీ సంతకాల సదువులెందుకంటా! సంతలో అమ్మడానికా! నన్నడిగితే, ఈ పాటసాలలన్నీ మూసేసి పసువుల కొట్టాలుగా మార్చటమే మంచిది సూడు! నా బాసలో యాస ఉండొచ్చుకాని ఏలిముద్ర మాత్రం ముచ్చటగా ఉంటాది కాగితంపైన. నాకు రాజ్యాంగం తెలీదు గానీ నా హస్తాంగం గూర్చి అమెరికా ఎల్లి గొప్ప డాకటేరు వద్ద సూపించా బద్రంగా ఉందని మాత్రం సెప్పినాడు. ఈ మద్దెనే రాజకీయం మరచి నాటక రంగంలో సేరా! ఎందుకో తెలుసా! నాటకీయం అంటే రాజకీయమే గదా! అందుకే ఈ రంగంలో మెలకువలన్నీ నేర్చుకుంటన్నా. 'ఇంకో యిసయం తెల్సా! మీ కందరికీ సేచ్చగా మాటాడే హక్కు ఉందంట కానీ కాకుల మాదిరిగా గోలసేసారంటే అందరినీ పిట్టల్ని కాల్చినట్టు కాల్పిస్సేస్తా నాకు ఏ వాదం మీదా నమ్మకం లేదు. నా వాదం నాది. అందరికీ అది తెలుసుగా! సూడండి. నా ఎనకాల ఎంత యంత్రాంగం ఉందో! రాజ్జాంగం, దాన్ని నడిపే యంత్రాంగం నా హస్తంలోని ఏలిముద్రల్లో ఉందట. అందుకే నేను ఏలిముద్రలమీద నిలబడింది. ఏమేమో మాటాడేసానేమో! సివరగా ఒకటి యినండి. మీరందరు తప్పకుండా మీ ఓటు ముద్రలు నా ఏలిముద్రల గురుతుపై ఏసి గెలిపించాలి. గెలిపిత్తారుగా!" అని నెత్తిన చెయ్యి పెట్టి తన వుపన్యాసం ముగించి, గాలిలో ఒక సారి చేయి వూపి కుర్చీతో కూలబడ్డాడు.

ప్రజల్లో ఎలాంటి భావాలు వ్యక్తమయ్యాయోనని నేను పరికిస్తుండగానే వచ్చిన పార్టీ వారందరూ వెళ్ళిపోయారు. జనం కూడా ఒక్కొక్కరుగా వెళ్లిపోసాగారు. ఆ ఉపన్యాసం విన్న. అతనిలో ఆవేశం పొంగుకొచ్చింది. ఆహా! ఏమిజనం! జనంలో మనం ఒకరం! మనం అంటే భయం. ఎవరికి మనకే! ఎందుకంటే మన సహవాసం ప్రజాస్వామ్యంతో. అయితే దాని సాహచర్యం ప్రజాసేవకులకి రాజ్యాంగం, దాని నియమాలు, కట్టుబాట్లు మనకైతే ప్రభుత్వ యంత్రాంగం ఈ ప్రజాసేవకులకి! ఈ ప్రజానాయకునికీ వ్యవస్థ, రాజ్యాంగం పట్టలేదు. అతని దృష్టి అంతా అతని హస్తం హస్తాంగాల మీద! ఇవే మనల్ని నడిపించేవి! మన దేశ భవిష్యత్తులో, వ్యవస్థలో ఎలాంటి నాయకులు చెరగని ముద్రలు కాదు మరకలు ప్రజానాయకుల నోటినిండా మాటల మూటలే! చేతలు, చేతులు మాత్రం శూన్యం.

నిజమే! శూన్యం! అదే ప్రజానాయకుడు వెళ్ళిపోగా మైదానంలో మిగిలింది. అదే మనలోనూ, మన వ్యవస్థలోను మిగిలింది. లోపలా బయటా అంతా శూన్యం! చివరకు మిగిలేదీ శూన్యమే. ఇలాంటి నాయకుల చేతిలో దేశం పడితే అంతా శూన్యం. శూన్యం అని గట్టిగా అరవాలనిపించింది. మాట గొంతు దాటి బయటికి వచ్చిందో లేదో గాని వినిపించలేదు. అంతలోనే సత్యం! సత్యం లేవరా! ఏమిటి కలగన్నావాలే అని తల్లికంఠం వినిపించగానే మెలకువ వచ్చింది. "ఏమిటి కలా కలగన్నానా" తనలో తనే అనుకున్నట్లుగా అన్నాడు. "ఏమిటో శూన్యం శూన్యం అని అరుస్తున్నావు కలగన్నావా" మరల అడిగింది తల్లి!

"నిజమే! కలే! కలే అదంతా! అదే నిజమైతే!" కలవరాన్ని దాచుకొంటూ ఏమీ లేదులే! అమ్మా అన్నాడు లేని కూర్చొంటూ!

అంతలో వెంకన్న రానే వచ్చాడు! ఎల్దామా సత్తెంబాబూ!' అంటూ!

కూర్చో వెంకన్నా! అయిదు నిమిషాల్లో వస్తాను. అని లేచి పెరట్లోకి నడిచాడు. సత్యం మొహం కడుక్కోవటానికి కల ద్వారా కలిగిన కలవరం కడుక్కోవటానికి కూడా!